RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 5
సంపుటి: 4 సంచిక:79 | మార్చి 05, 2026 | వెల: రూ.3-00



**బాచుపల్లిలో భారీ అగ్నిప్రమాదం**

కోట్ల రూపాయల ఆస్తి నష్టం

2లో




- ఓ గ్రామ యువత వందల కోట్ల లావాదేవీలు చేసినట్లు సమాచారం
- ఈడీ సైతం నోటీసులు పంపిందన్న ప్రచారం
- ఆన్లైన్ బెట్టింగ్ తో జీవితాలు నాశనం చేసుకుంటున్న యూత్
- నష్టాలు వచ్చినప్పుడు ఎవరికి చెప్పకోవాలో తెలియని పరిస్థితి
- ఏం చేయాలో తెలియక చివరకు మృత్యు ఒడికి..

# ఇల్లంతకుంటలో..
# రూ.150 కోట్ల బెట్టింగ్!?

మండలంలో చాప కింద నీరులా జూదం

నిశ్శబ్దంగా జరుగుతున్న వందల కోట్ల దందా..

2లో

**వేద న్యూస్, ఇల్లంతకుంట**

బయటకు స్మార్ట్‌ఫోన్లో ఆడే చిన్న ఆటలా కనిపిస్తుంది.. కానీ లోపల అది వేల కుటుంబాలను బలితీసుకుంటున్న మృత్యుపాశం.. ఇల్లంతకుంట మండలం ఇప్పుడు ఒక ప్రమాదకరమైన ఆన్లైన్ బెట్టింగ్ విషవలయంలో చిక్కుకుంది. క్షణాల్లో కోటీశ్వరులమవుతామన్న భ్రమలో.. ఉన్న ఆస్తిని, ఆఖరికి ప్రాణాలను కూడా పణంగా పెడుతున్న యువత కథ ఇది. కేవలం టీ స్టాళ్లు, హోటళ్లకే పరిమితం కాకుండా.. 150 కోట్ల రూపాయల మేర లావాదేవీలు జరిపి ఈడీ నోటీసుల వరకు చేరిన ఈ దందా.. ఇప్పుడు మండలంలో కలకలం రేపుతోంది. అమాయకుల బ్యాంక్ అకౌంట్లను అద్దెకు తీసుకుని, సామాన్యులను సైతం ఆదాయపు పన్ను శాఖ చిక్కుల్లోకి నెట్టేస్తున్న ఈ బెట్టింగ్ మాఫియా వెనుక ఎవరున్నారు? వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నా, ఆత్మహత్యలు పెరుగుతున్నా.. యంత్రాంగం ఎందుకు మౌనంగా ఉంది? ఇది కేవలం బెట్టింగ్ కాదు.. ఒక వ్యవస్థీకృత ఆర్థిక నేరం. ఇల్లంతకుంటను కమ్మేస్తున్న ఈ బెట్టింగ్ భూతంపై 'వేద న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం

# అప్లికేషన్లు ఎక్కడ?
# హామీలు ఏమయ్యాయి?!





- ముంపు బాధితుల ఆశలు నెరవేరేనా?
- ఎన్నికల వేళ హామీల వర్షం
- అధికారంలోకి వచ్చాక ఆచరణలో శూన్యం
- రెండుసార్లు దరఖాస్తులు.. అయినా కదలని ఫైళ్లు

2లో

**అధికారుల నిర్లక్ష్యంపై కోదురుపాక, నీలోజిపల్లి ప్రజల ఆగ్రహం**

# మావోయిస్టు అగ్రనేత
# గణపతి లొంగుబాటు..?!



**ఢిల్లీలో పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం**

- నలభై ఏళ్లకు పైగా ఉద్యమంలో కీలక పాత్ర
- ఆరోగ్య సమస్యలతో ఉద్యమానికి దూరం
- టీచర్‌గా పనిచేసి తరువాత అండర్‌గ్రౌండ్ జీవితం
- పలు మారుపేర్లతో కార్యకలాపాలు సాగించిన గణపతి
- జగిత్యాల జిల్లా బీర్పూర్ గ్రామానికి చెందినవారు

2లో

# కాలువ పనులు ఆగే ప్రసక్తే లేదు

- రైతుల కన్నీళ్లు తుడిచే బాధ్యత నాది
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- పెద్దలింగాపూర్ లో రైతుల దీక్షా శిబిరం సందర్శన

2లో



వేద న్యూస్

గురువారం | మార్చి 05, 2026

# కాలువ పనులు ఆగే ప్రసక్తే లేదు

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి**

తంగళ్ళపల్లి మండలం పెద్దలింగాపూర్ గ్రామం వద్ద నిలిచిపోయిన కాళేశ్వరం ప్యాకేజీ–11/6 కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. కాలువ పనులు ఆగే ప్రసక్తే లేదని, రైతుల కన్నీళ్లు తుడిచే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. పెద్దలింగాపూర్ గ్రామాన్ని సందర్శించిన మల్లన్న నిలిచిపోయిన కాలువ పనులను పరిశీలించారు. అలాగే కాలువ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ 12 గ్రామాల రైతులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ.. కేవలం ఒక కిలోమీటర్నర పనులు నిలిచిపోవడంతో పలు గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. పనుల్లో మరింత జాప్యం జరిగితే సహించేది లేదని అధికారులను హెచ్చరించినట్లు మల్లన్న వెల్లడించారు. కాలువ పనులు పూర్తైతే సుమారు 10 వేల ఎకరాల సాగుభూమికి నీరు అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మాదం రజినీ కుమార్ యాదవ్, వట్టె జానయ్య యాదవ్, బంధారపు నర్సయ్య గౌడ్, కొమ్ముల ప్రవీణ్, నీరజ గౌడ్, గీస మధు యాదవ్, జిల్లా అధ్యక్షుడు మల్లేశం, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. గ్రామాల రైతులు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను వివరించారు.

# చిట్టితల్లికి పెద్ద కష్టం!

- తీవ్రమైన లివర్ వ్యాధితో బాధపడుతున్న సహస్ర
- చికిత్స కోసం రూ.30 లక్షలు అత్యవసరం
- పదేళ్ల తమ పాపను కాపాడాలంటూ తల్లిదండ్రుల వేడుకోలు
- దాతలు సాయం చేయాలంటూ విజ్ఞప్తి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి**



సిరిసిల్ల పట్టణంలో ఓ పేద నేత కార్మికుడి కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక, మానసిక కష్టాల్లో ఉంది. తమ పదేళ్ల కుమార్తె ప్రాణాలను కాపాడుకోవడానికి దాతల సహాయం కోసం తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సిరిసిల్ల పట్టణం 34వ వార్డుకు చెందిన అంబటి వేణు వృత్తిరీత్యా నేత కార్మికుడు. ఆయన భార్య బీడీలు చుడుతూ కుటుంబ పోషణలో సహాయం చేస్తున్నారు. వీరి కుమార్తె అంబటి సహస్ర (10) గత కొంతకాలంగా తీవ్రమైన లివర్ వ్యాధితో బాధపడుతోంది. పరిస్థితి విషమించడంతో ఆమెను హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యులు చిన్నారికి అత్యవసరంగా లివర్ మార్పిడి శస్త్రచికిత్స అవసరమని, దీనికి సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇప్పటికే కుటుంబ సభ్యులు అప్పులు చేసి సుమారు రూ.5 లక్షలు చికిత్స కోసం ఖర్చు చేసినట్లు తెలిపారు. రోజువారీ కూలీపై ఆధారపడే ఈ కుటుంబానికి మిగిలిన భారీ మొత్తాన్ని సమకూర్చడం కష్టంగా మారింది. 'మా కళ్లముందే బిడ్డ మంచాన పడుకుని ఉంది. మేము ఎంత ప్రయత్నించినా అంత పెద్ద మొత్తం సమకూర్చలేకపోతున్నాం. దయచేసి దాతలు ముందుకు వచ్చి మా బిడ్డ ప్రాణాలను కాపాడాలి' అంటూ తండ్రి అంబటి వేణు కన్నీటి పర్యంతమై విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం చేయాలనుకునే దాతలు ఫోన్‌పే నంబర్లు: 9912231674, 9676260746 కు ఆర్థిక సాయం పంపించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. చిన్నారి సహస్ర ప్రాణాలను కాపాడేందుకు మనసున్న వారు ముందుకు రావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాచుపల్లిలో భారీ అగ్నిప్రమాదం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్ నగరంలోని బాచుపల్లి ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మియాపూర్–బాచుపల్లి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఫర్నిచర్ దుకాణాల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి తీవ్ర కలకలం రేపాయి. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి సుమారు 10:45 గంటల సమయంలో ఒక దుకాణంలో ప్రారంభమైన మంటలు క్షణాల్లోనే పక్కనున్న షాపులకు వేగంగా వ్యాపించాయి. దుకాణాల్లో కలప, ఫర్నిచర్, ఫోమ్ వంటి తేలికగా మండే పదార్థాలు అధికంగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. కొంతమంది వ్యాపారులు దుకాణాల పక్కనే నివాసం ఉండటంతో అక్కడ నిల్వ ఉంచిన వంట గ్యాస్ సిలిండర్లు భారీ శబ్దాలతో పేలాయి. ఆ ప్రాంతంలో మొత్తం సుమారు 25 ఫర్నిచర్ దుకాణాలు ఉండగా, నిమిషాల వ్యవధిలోనే 18 షాపులకు మంటలు వ్యాపించాయి.

# ఇల్లంతకుంటలో.. రూ.150 కోట్ల బెట్టింగ్..!?

**వేద న్యూస్, ఇల్లంతకుంట**




- మండలంలో చాప కింద నీరులా జూదం
- నిశ్శబ్దంగా జరుగుతున్న వందల కోట్ల దందా..
- ఓ గ్రామ యువతకు రూ.150 కోట్ల లావాదేవీలు చేసినట్లు సమాచారం
- ఈడీ సైతం నోటీసులు పంపిందన్న ప్రచారం
- ఆన్లైన్ బెట్టింగ్ తో జీవితాలు నాశనం చేసుకుంటున్న యూత్
- నష్టాలు వచ్చినప్పుడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి
- ఏం చేయాలో తెలియక చివరకు మృత్యు ఒడికి..

ఇల్లంతకుంట మండలం ఇప్పుడు ఒక ప్రమాదకరమైన ఆన్లైన్ బెట్టింగ్ విష వలయంలో చిక్కుకుంది. బయటకు అంతా ప్రశాంతంగా కనిపిస్తున్నా, లోలోపల మాత్రం యువత జీవితాలను ఈ వ్యసనం చాప కింద నీరులా దహించివేస్తోంది. సరదా కోసం మొదలైన ఈ ఆట, ఇప్పుడు కుటుంబాలను రోడ్డున పడేసే స్థాయికి చేరింది. అప్పులు తెచ్చి మరీ బెట్టింగ్ పెట్టి, చివరకు చేతిలో చిల్లిగవ్వ లేక, వచ్చిన అప్పులను తీర్చలేక, ఎవరికీ చెప్పుకోలేక.. ఎంతోమంది యువకులు మానసిక వేదనతో, ఆత్మహత్యల అంచున కొట్టుమిట్టాడుతున్నారు.

**టీ స్టాళ్లు, హోటళ్లే కేంద్రాలు**

ఈ బెట్టింగ్ దందాకు మండలంలోని అనేక టీ స్టాళ్లు, హోటళ్లు అడ్డాలుగా మారాయని స్థానికులు చెబుతున్నారు. గుంపులు గుంపులుగా చేరి, ఫోన్లకే పరిమితమై ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ ద్వారా భారీగా డబ్బులు పందాలు కాస్తున్నారు. ఈ బెట్టింగ్ బాబులు కొందరు మేము కోటీశ్వరులమయ్యాం.. ఖరీదైన కార్లు కొన్నాం అని గొప్పలు చెప్పుకుంటూ తిరుగుతుండటం విశేషం. ఈ ప్రలోభాలకు లోనైన పక్క గ్రామాల యువత కూడా, తాము కూడా త్వరగా ధనవంతులం కావచ్చనే భ్రమలో ఈ మృత్యుపాశంలో అడుగుపెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువవ్వడంతో, ఈ దందా రోజురోజుకూ రెచ్చిపోతోంది.

**అద్దెకు 'బ్యాంక్ ఖాతాలు'**

బెట్టింగ్ యాప్స్‌లో లావాదేవీలు విపరీతంగా పెరగడంతో, బ్యాంకులు అనుమానాస్పద లావాదేవీలను గుర్తించి ఆ ఖాతాలను నిలిపివేస్తున్నాయి. దీంతో, బెట్టింగ్ మాఫియా సరికొత్త ఎత్తుగడ వేసింది. తమకు అనుకూలంగా ఉండే వారి ఖాతాలతో పాటు, తెలియని అమాయకుల ఖాతాలను కూడా అద్దె ప్రాతిపదికన తీసుకుంటున్నారు. ఏదో కొంత కమీషన్ వస్తుందన్న ఆశతో సామాన్యులు తమ ఖాతాలను వీరికి అప్పగిస్తున్నారు. కానీ, అకౌంట్లలో లక్షల రూపాయల లావాదేవీలు జరగడంతో, ఆదాయపు పన్ను శాఖ నుంచి వీరికి నోటీసులు అందుతున్నాయి. అసలు ఏం జరిగిందో తెలియక, లక్షల జరిమానాలు కట్టలేక సామాన్యులు నెత్తి నోరు బాదుకుంటున్న దుస్థితి నెలకొంది.

**రూ.150 కోట్ల దందా.. ఈడీ నోటీసుల కలకలం!**

మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువత దాదాపు 150 కోట్ల రూపాయల మేర లావాదేవీలు నిర్వహించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఈడీ కూడా నోటీసులు పంపిందన్న ప్రచారం మండల వ్యాప్తంగా కలకలం రేపింది. అయినా సరే, బెట్టింగ్ దందా ఆగకపోగా, కొత్త కొత్త మార్గాల్లో విస్తరిస్తోంది. క్యాసినో తరహాలో ఆన్లైన్ బెట్టింగ్ నడుపుతూ, ఎన్నో కుటుంబాల పొట్ట కొడుతున్నారు. ఓడిపోయిన తర్వాత అప్పుల బాధ భరించలేక యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నా, ఎందుకు ఎవరూ అడ్డుకోవడం లేదనేది ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్న.

**నిద్ర మత్తులో యంత్రాంగం**

యువత జాగ్రత్త.. ఆన్లైన్ బెట్టింగ్ వ్యసనానికి దూరంగా ఉండండి అంటూ అధికారులు చేసే ప్రకటనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఈ మాఫియాను కట్టడి చేసే చర్యలు మాత్రం కనిపించడం లేదు. అక్రమ లావాదేవీలపై నిఘా ఉంచాల్సిన బ్యాంకులు, సైబర్ క్రైమ్ పోలీసులు, స్థానిక యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తేనే ఈ దందాను అరికట్టవచ్చు. లేదంటే, ఇల్లంతకుంటలో ఎంతోమంది యువకుల భవిష్యత్తు ఈ ఆన్లైన్ వ్యసనానికి బలి కాక తప్పదు. ప్రభుత్వం, పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి, ఈ బెట్టింగ్ మాఫియా వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అప్లికేషన్లు ఎక్కడ? హామీలు ఏమయ్యాయి?!

**వేద న్యూస్, బోయినిపల్లి**



- ముంపు బాధితుల ఆశలు నెరవేరేనా?
- ఎన్నికల వేళ హామీల వర్షం
- అధికారంలోకి వచ్చాక ఆచరణలో శూన్యం
- రెండుసార్లు దరఖాస్తులు.. అయినా కదలని ఫైళ్లు
- అధికారుల నిర్లక్ష్యంపై కోదురుపాక, నీలోజిపల్లి ప్రజల ఆగ్రహం

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని కోదురుపాక, నీలోజిపల్లి గ్రామాల పరిస్థితి ఇప్పుడు మిడ్ మానేర్ ప్రాజెక్టు ముంపు కంటే దారుణమైన మోసంలో కూరుకుపోయింది. ఒకప్పుడు సిరిసంపదలతో కళకళలాడిన ఈ గ్రామాలు, నేడు కన్నీటి గాథలుగా మిగిలాయి. ఇళ్లు, పొలాలు, పశువులు, తరతరాల జ్ఞాపకాలు.. ఇలా సర్వస్వాన్ని త్యాగం చేసిన ఈ బాధితులు, ఇప్పుడు బతుకు దెరువు లేక, చావలేక బతకలేక దిక్కుతోచని స్థితిలో నరకం అనుభవిస్తున్నారు.

**ముంపు హామీలు ఏమయ్యాయి?**

ముంపు బాధితుల కష్టాలను అర్థం చేసుకోవాల్సింది పోయి, కొందరు రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం బాధితుల భావోద్వేగాలతో చెలగాటమాడుతున్నారు. ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించిన నాయకులు, ఎన్నికల తర్వాత మొహం చాటేయడం ఆనవాయితీగా మారింది. కుటుంబానికి రూ.5,04,000 పరిహారం, 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు 2 గుంటల భూమి, యువతకు రూ.2,04,000 నగదు అంటూ హామీలు ఇచ్చారు. ఈ హామీలపై నమ్మకం ఉంచిన బాధితులు, ఎక్కడెక్కడో స్థిరపడి ఉన్న పనులు వదిలేసి, తమకు ఉన్న అరకొర డబ్బులు ఖర్చు పెట్టుకుని మరీ.. రెండు సార్లు అప్లికేషన్లు సమర్పించారు. ప్రాజెక్టు కోసం సర్వస్వం కోల్పోయిన వారు, ప్రభుత్వం ఇస్తానన్న పరిహారం కోసం ఆశగా ఎదురుచూశారు. కానీ, అప్లికేషన్లు తీసుకున్న అధికారులు, ఆ నాయకులు ఇప్పుడు ఎక్కడికి వెళ్లారు? ఆ అప్లికేషన్లు ఏ అల్మారాల్లో మూలన పడ్డాయి? అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.

**అవసరం తీరాక.. ఆశలు తీరవు**

'ఎన్నికల సమయంలో మాత్రమే వస్తారు.. అవసరం తీరాక మమ్మల్ని మరిచిపోతారు' ఇది కోదురుపాక, నీలోజిపల్లి గ్రామస్తుల ఆవేదన. ప్రతిసారీ కొత్త హామీతో నాయకులు వస్తున్నారు.. కానీ ఆచరణలో మాత్రం శూన్యం. ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన వారు నేడు కూలీలుగా మారాల్సిన దుస్థితిని ఏ పాలకులు చూస్తున్నారు? మాటల ముంపులో మునిగిపోతున్న తమ బతుకులకు దిక్కెవరు? ప్రభుత్వానికి తమ కన్నీళ్లు కనిపించడం లేదా? అంటూ వారు నిలదీస్తున్నారు.

**గ్రామస్తుల ఆక్రందన..**

ముంపులో అన్నీ కోల్పోయిన ప్రజలు, నేడు హామీల వలలో చిక్కుకుని నలిగిపోతున్నారు. ప్రభుత్వం హామీలు ఇచ్చినప్పుడు ఉన్న ఉత్సాహం, అమలు విషయంలో ఎందుకు లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. అప్లికేషన్లు తీసుకున్న వారు ఇప్పుడు సమాధానం చెప్పే పరిస్థితిలో లేకపోవడం, వారి రాజకీయ నీతిని ఎండగడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు మేల్కొనాలి. కోదురుపాక, నీలోజిపల్లి ప్రజల ఆవేదనను గుర్తించాలి. కేవలం ఎన్నికల కోసం మాత్రమే కాకుండా, ముంపు బాధితుల కన్నీళ్లను తుడిచే దిశగా చర్యలు తీసుకోవాలి. లేదంటే, మరోసారి రాజకీయ నాయకుల మాటలను నమ్మే పరిస్థితిలో లేమని, తాము మోసపోయామని భావిస్తున్నామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

# మావోయిస్టు అగ్రనేత గణపతి లొంగుబాటు..?!

**వేద న్యూస్, హైదరాబాద్**



మావోయిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి ఢిల్లీలో పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం వెలువడటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. చాలాకాలంగా అజ్ఞాత జీవితం గడుపుతున్న ఆయన అకస్మాత్తుగా బయటకు రావడం భద్రతా వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం బీర్పూర్ గ్రామానికి చెందిన గణపతి దేశంలోని మావోయిస్టు ఉద్యమంలో అత్యంత ప్రభావవంతమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రారంభంలో చదువులో ప్రతిభ చూపిన ఆయన బీఎస్సీ, బీఎడ్ పూర్తి చేసి కరీంనగర్ ప్రాంతంలో సైన్స్ టీచర్‌గా పనిచేశారు. తరువాత ఉద్యమ ప్రభావంతో పీపుల్స్ వార్ గ్రూప్‌లో చేరి పూర్తిగా అండర్‌గ్రౌండ్ జీవితాన్ని ప్రారంభించారు. ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన గణపతి క్రమంగా పార్టీ కీలక నేతగా ఎదిగారు. 1992లో కొండపల్లి సీతారామయ్య తరువాత పీపుల్స్ వార్ గ్రూప్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన నాయకత్వంలో సంస్థ కార్యకలాపాలు పలు రాష్ట్రాలకు విస్తరించాయి. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మావోయిస్టు కార్యకలాపాలు బలంగా కొనసాగాయి. 2004లో పీపుల్స్ వార్ గ్రూప్ మరియు మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ విలీనం కావడంతో సీపీఐ మావోయిస్టు పార్టీ ఏర్పడింది. ఆ పార్టీకి గణపతి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై దాదాపు 2018 వరకు పార్టీ అత్యున్నత నాయకుడిగా కొనసాగారు. ఆయనను ఉద్యమానికి ప్రధాన వ్యూహకర్తగా భావిస్తారు. అజ్ఞాత జీవితం గడిపిన గణపతి గణపతి, రాజన్న, శ్రీనివాస్, రాజిరెడ్డి, రాధాకృష్ణ, చంద్రశేఖర్, అజిత్ వంటి అనేక మారుపేర్లతో కార్యకలాపాలు నిర్వహించినట్లు భద్రతా సంస్థలు చెబుతున్నాయి. ఒక దశలో మావోయిస్టు ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడంలో ఆయన పాత్ర కీలకంగా నిలిచింది. ప్రస్తుతం 76 ఏళ్ల వయస్సులో ఉన్న గణపతి వృద్ధాప్యంతో పాటు తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా కీళ్ల నొప్పి కారణంగా నడవడం కూడా కష్టమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ కారణాలతోనే 2018లో ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పుకున్నట్లు చెబుతున్నారు. ఆయన స్థానంలో నంబాల కేశవరావు బాధ్యతలు చేపట్టగా తరువాత ఎన్‌కౌంటర్‌లో ఆయన మరణించినట్లు వార్తలు వచ్చాయి. గణపతి గత కొంతకాలంగా ఎక్కడ ఉన్నారన్నది స్పష్టంగా తెలియకపోయినా కొంతకాలం దండకారణ్యం ప్రాంతంలో ఉన్నారని, తరువాత నేపాల్ లేదా ఇతర ప్రాంతాల్లో రహస్యంగా చికిత్స పొందుతున్నారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.



# అన్నదాత వరి గోస

**చేతికొచ్చిన పంట చేజారిపోతుందని రైతుల ఆందోళన**

**వేద న్యూస్, వేములవాడ రూరల్**

వేములవాడ రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో వేసవి ఎండలు తీవ్రంగా పెరగడంతో రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పంట చేతికొచ్చే సమయంలో నీరు అందక వరి పొలాలు కళ్లముందే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం బావులు, బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో సరైన వర్షాలు లేక చెరువులు, కుంటలు నిండకపోవడంతో భూగర్భ జలాలు కూడా అడుగంటాయి. దీంతో వరి, మొక్కజొన్న వంటి పంటలు ఎండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని వాపోతున్నారు. యాసంగి సీజన్‌లో సాగుకు సరిపడా నీరు లేక చేతికొచ్చిన పంటలు పశువుల పాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలను నీటితో నింపి పంట పొలాలు ఎండిపోకుండా చూడాలని స్థానిక ఎమ్మెల్యే, అధికారులను రైతులు కోరుతున్నారు.

వేద న్యూస్

గురువారం మార్చి 05, 2026

## వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండలం గర్షకుర్తి గ్రామంలోని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు పురోహితులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వాదాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలని, సమాజంలో ఐక్యతను పెంపొందించే వేదికలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచ్ చిందం ఆంజనేయులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, రామిడి రాజిరెడ్డి, చిప్ప చక్రపాణి, సాగి అజయ్ రావు, రాజగోపాల్ రెడ్డి, గుండా రాజేశం, శ్రీనివాస్, మ్యాక్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

**- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**వేద న్యూస్, గంగాధర:**



చొప్పదండి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు బొజ్జ సునీత-తిరుపతి దంపతుల గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు ఇల్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో గత రెండేళ్లలో చొప్పదండి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత మందికి ఇళ్లు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గతంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. ఇంకా ఇల్లు రాని అర్హులైన నిరుపేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# అందని నీరు..ఆందోళనలో రైతులు

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాలువలకు నీళ్లు అందక యాసంగి కి పంటలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. మండలంలో సాగు నీటి అవసరం ఎక్కువగా ఉన్న తరుణంలో భూగర్భ జల మట్టం వేగంగా అడుగంటగా చివరి ఆయకట్టుకు కాలువ నీరు అందకపోవడంతో చివరి దశకు వస్తున్న పైరు ఎండిపోతున్నాయి. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉండగా పంటలు పూర్తిగా ఏప్రిల్ , మే మాసం వరకు పరిస్థితి విషమించి పెద్ద ఎత్తున పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు .

**తక్షణ చర్యలు అవసరం**

శాయంపేట మండల కేంద్రంలోని రైతుల పంటలు చేతికి వచ్చే సమయంలో నీరు అందకపోకపోతే రైతుల కష్టం అంతా బూడిదలో పోసిన పన్నీరు అయ్యే అవకాశం ఉన్నది. ఎస్సారెస్పీ నీరు అందక రైతులు నిరాశ చెందుతున్నారు. ఎస్సారెస్పీ నుండి చిన్న ఉప కాలువ వరకు నీరు అందించాలని అధికారులు నిర్ణయించిన ,ఏప్రిల్ వరకు నీటి తడులకు పోడిగింపు చివరి ఆయకట్టు వరకు నీరు పారేలా చూడాలని కాలువలకు అధిక మొత్తం లో నీటిఅవసరం ఉన్న పంట భూములకు,గొలుసు కట్టు చెరువులు ,కుంటల్లోకి నీటిని జలాల స్థిరంగా కొనసాగిస్తేనే పంటలను కాపాడుకోవచ్చు.

**జాతీయ రహదారి బ్రిడ్జి కింద ఉన్న పైపులను తొలగించాలి**



జాతీయ రహదారి ఓగులాపూర్ నూతన బ్రిడ్జి కింద ఉన్న పైపులను తొలగిస్తే చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తేనే పంటలు సమృద్ధిగా పండుతాయి. శాయంపేట, మైలారం, ఆరేపల్లి ,పత్తిపాక రైతుల పంటలు చివరి దశలో ఉన్నాయి. కాబట్టి నీళ్లు అందకపోవడంతో ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి ప్రవాహానికి చెత్తాచెదారం తట్టుకుని నీళ్లు రాక ఇబ్బంది పడుతున్న రైతన్నలు సొంతంగా చెత్త తీసివేయడం జరిగింది. అయినా కూడా నీళ్లు చివరి ఆయకట్టు వరకు అందకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తుంది. ఇప్పటికైనా ఎస్సారెస్పీ అధికారులు స్పందించి వెంటనే ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు అందించి ఆదుకోవాలని కోరారు.

# బెల్ట్ షాపులు ఎక్సైజ్ ఎస్సైకి వినతి

**వేద న్యూస్, మంథని :**



మంథని పట్టణంలోని పోచమ్మ వాడలో బెల్ట్ షాపులు నడుపుతూ కల్తీ మద్యం విక్రయిస్తూ కుటుంబాలను విచ్చినం చేస్తున్నారని వెంటనే ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపులు తొలగించాలని పోచమ్మ వాడ స్థానిక పెద్ద మనుషులు లైసెట్టి రాజు పిల్లి సత్తయ్య, సంఘి శీను తో పాటు పలువురు మంథని ఎక్సైజ్ ఎస్సైకి వినతి పత్రం అందజేశారు. బుధ వారం మంథని ఎక్సైజ్ ఎస్సై సాయికి వినతి పత్రం అందజేస్తూ పోచమ్మ వాడలో పుట్టగొడుగుల్లా ఆరు బెల్ట్ షాపులు ఉన్నాయని,కల్తీ మధ్య విక్రయిస్తూ పేదలను దోచుకుంటున్నారని కుటుంబం కుటుంబాలను విచ్చినం చేస్తున్నారని, యువకులు పెడదారి పడుతున్నారని వారు వాపోయారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి బెల్ట్ షాపులను మూసివేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళలతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని మహిళలు తాటి దుర్గమ్మ, కొట్టే లింగమ్మ, మిట్ట శంకరమ్మ, గడి లక్ష్మి, తాటి లక్ష్మి, శెట్టి శివమ్మ, తాటి మల్లక్క లు హెచ్చరించారు.

# విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠ శాల, అంబం మోడల్ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ సహకారంతో బుధవారం పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండూరు ప్రశాంత్ గౌడ్, నాయకులు కటికే రామ్ రాజ్, కుల్లెర మోహన్ రావు, వెంకటేష్, బోజిగొండ అనిల్, కుమ్మరి గణేష్, వడ్ల సాయినాథ్, అంబం గ్రామ సర్పంచ్ కుర్లెపు గంగాధర్, ఉప సర్పంచ్ రేపల్లి సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

**- నిబంధలనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు**

**- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి**

**వేద న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి:**

మెట్‌పల్లి పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో బుధవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, అతిక్రమించిన వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ సమయంలో పేర్కొన్న డాక్టర్ల ద్వారానే వైద్య సేవలు అందించాలని, కొత్త డాక్టర్లు చేరితే ముందుగా రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌లో నమోదు చేయాలని సూచించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం-1994 ప్రకారం లింగ నిర్ధారణ చేసి ఆడా, మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్లలో యంత్రాలు, డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తులో పేర్కొన్న విధంగానే ఉన్నాయా అని పరిశీలించినట్లు తెలిపారు. ఫారం-ఎఫ్ వివరాలను ప్రతి నెల 5వ తేదీలోపు సంబంధిత పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమర్పించాలని సూచించారు. అలాగే స్కానింగ్ సెంటర్లలో "ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు.. చేస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయి" అనే బోర్డులు స్పష్టంగా ప్రదర్శించాలని డాక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు.



# కానరాని స.హ చట్టం బోర్డు..!?

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలోని మండల సమీకృత సముదాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డు లేకపోవ డంతో, సమాచారం కోసం కార్యాల యానికి వచ్చిన వారికి ఎవరికి దరఖాస్తు అందజేయాల్లో తెలియక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేసి దానిపై సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి పేర్లు, ఫోన్ నెంబర్లు రాయించి ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే తహశీల్దార్ కార్యాలయంలో అసలు సమాచార హక్కు చట్టం బోర్డు లేకపోవడంతో ఎవరికి దరఖాస్తు చేయాలో తెలియక దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారిందని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మండల సమీకృత సముదాయ కార్యాలయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ సమాచార హక్కు చట్టాన్ని నీరుగారుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలి



**వేద న్యూస్, మరిపెడ:**

లైన్మెన్ దివాస్ ను పురస్కరించుకొని మరిపెడ విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధి లోని మరిపెడ,ఎల్లంపేట, చిన్నగూడూరు మరియు నరసింహులపేట సెక్షన్లలో ఈ యొక్క కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థలో పని చేస్తున్న కటర్స్ నుంచి ఫోర్ మెన్ వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నటువంటి ప్రతి ఒక్క సిబ్బందిని ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి స్వీట్స్ పంచడం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ లో పని చేసి ప్రాణాలు కోల్పోయిన వారికీ నివాళ్లు అర్పించడం జరిగింది. విద్యుత్ శాఖలో గాలి వర్షం వరదల్లో రేయింబవాళ్ళు పనిచేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందజేస్తూ నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తున్న సిబ్బంది కి ప్రశంషాపత్రాలను అందచేయడమైనది. ఈ కార్యక్రమంలో మరిపెడ సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఏడిఇ ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు. భద్రతా సూత్రాలను పాటిస్తూ వినియోగ దారులకు అందుబాటులో వుంటూ మెరుగైన సేవలను అంద చేయాలిసిందిగా కోరారు. ఆయా సెక్షన్ విద్యుత్ శాఖ ఏఇలు పావని, ఎండీ. రూబీన,పాండు మరియు ఎండీ. జహూర్ పాషా స్థానిక విద్యుత్ ఉద్యోగులు హాజరు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## భద్రకాళి అమ్మవారికి వెండి వడ్డానం, కన్నులు బహుకరణ



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

మనసుంటే మార్గం ఉంటుందని,పుట్టి పెరిగిన ఊరిలో భక్తులు కోరిన కోరికను తీర్చి భద్రకాళి అమ్మవారికి ఆమనగల్లు గ్రామానికి చెందిన ఉత్తర్ల సైదులు-మౌనిక వెండి వడ్డానం, కన్నులు బహుకరిం చారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాడి పంటలు సమృద్ధిగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేలా చల్లని దీవెనలు గ్రామ ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. దేవాలయ అభివృద్ధి కి తనవంతు సహకారం ఉంటుందన్నారు. దీంతో దేవాలయ ఇం చార్జ్ మేనేజర్ మృత్యుంజయ శాస్త్రి అర్చకులు రెంటాల సతీష్ శర్మ వారిని శాలువతో సన్మానించి అభినందించారు.

# జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఆహ్వానం

**వేద న్యూస్, వేములవాడ:**



మై భారత్ ఆధ్వర్యంలో, కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో అగ్రహారం గ్రామంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ మైదానంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు మార్చి 6, 7 తేదీలలో రెండు రోజులపాటు జరుగుతాయి. వాలీబాల్, కబడ్డీ, పరుగుపందెం, గుండుపోటు, బ్యాడ్మింటన్, చదరంగం వంటి క్రీడలు నిర్వహించబడతాయి. పోటీలలో పాల్గొనదలచిన 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల పురుషులు, మహిళలు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు గంగిపెల్లి స్వామి కుమార్ తెలిపారు. పేర్ల నమోదు కోసం దొంతర వేణి హరీష్ (8688295297), జూపల్లి రవితేజ (9347461020), వాలంటీర్ మారం గణేష్ (8978583002)లను సంప్రదించాలని సూచించారు. అర్హులైన క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

## పుష్కర ఘాట్‌ను పరిశీలించిన డీఎస్పీ రాములు

**వేద న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి:**



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలోని గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా మొగిలిపేట తీరంలోని పుష్కర ఘాట్‌ను డీఎస్పీ రాములు, మల్లాపూర్ ఎస్ఐ అనిల్ పరిశీలించారు. గ్రామ సర్పంచ్ గోల్కొండ కళా రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిశీలనలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై అధికారులు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సౌజన్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్లాటినం జూబ్లీ వేడుకలలో గౌరవ అతిధిగా హాజరవ్వండి

**వేద న్యూస్ , హనుమకొండ :**



రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి సెక్రెటరీ ఎ. పుల్లయ్యని వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా 29 మార్చి 2026 (ఆదివారం) రోజున వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 70 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరుకావాలని కోరుతూ శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు రాష్ట్ర సాంకేతిక విద్యా అభివృద్ధికి ముఖ్య భూమిక వహిస్తున్నాయని, పూర్వ విద్యార్థుల సమ్మేళనం వంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నందుకు వరంగల్ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘానికి అభినందనలు తెలిపారు. ఎస్.బి.టి.ఈ.టి సెక్రెటరీని కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్, నాయకులు ముషం శ్రీనివాస్, తాజుద్దీన్, శ్రీనివాస్ మహేంద్ర, చింతం గిరివర్మ, భూక్యా మధు, పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థిని ఇ.వి. కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## లాడ్జిలో యువకుడి అనుమానాస్పద మృతి

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ పట్టణంలోని ఓ లాడ్జిలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల సమాచారం ప్రకారం.. మృతుడి గదిలోకి ఒక యువతి మరియు ఓ వృద్ధుడు వెళ్లినట్లు తెలిసింది. కొంతసేపటి తరువాత వారు కంగారుగా గది నుంచి బయటకు వెళ్లిపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి నిర్వాహకురాలు గదిలోకి వెళ్లి చూసింది. అక్కడ యువకుడు మృతి చెందిన స్థితిలో కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చొప్పదండి యువకులకు అరుదైన అవకాశం

**వేద న్యూస్, చొప్పదండి:**





ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్చేంజ్ కోయంబత్తూరు కార్యక్రమానికి చొప్పదండి పట్టణానికి చెందిన నవతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చల్లా అనూష్, జాగిరి రాజేందర్ ఎంపికైనట్లు జిల్లా యువజన అధికారి (డీవైఓ) రాంబాబు తెలిపారు. జిల్లా నుంచి ఈ ఇద్దరు యువకులు ఎంపిక కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. మై భారత్ మేరా యువభారత్, నవతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రభుత్వం ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. కోయంబత్తూరులో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను చాటనున్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో హోలీ సంబరాలు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ పట్టణంలోని మంటప హనుమాన్ దేవాలయం వద్ద పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్స్, ఆవోపా, ఐవీఎఫ్ ఆధ్వర్యంలో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. సభ్యులు పరస్పరం రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సిద్ధంశెట్టి వేణు మాట్లాడుతూ హోలీ పండుగ చెడుపై మంచి విజయం సాధించిన దినాన్ని సూచిస్తుందని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, శ్రీ రాజరాజేశ్వర స్వామి, మంటప హనుమాన్, వాసవి మాత ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి సహకరించిన సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బుస్స దశరథం, కోశాధికారి చీకోటి నాగరాజు, సెస్ మాజీ చైర్మన్ అల్లాడ రమేష్, వాసవి క్లబ్ గవర్నర్ నరాల శ్రీనివాస్, ఆవోపా జిల్లా అధ్యక్షులు తాటికొండ పవన్, ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షులు నూకల శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షులు ఐత వెంకటేశ్వర్లు, మంటప హనుమాన్ భజన మండలి అధ్యక్షులు కటకం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులతో కలిసి భోజనం - సమస్యలపై ఆరా

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కిచెన్, వంటగది, బియ్యం, పప్పులు, గుడ్లు తదితర ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయం కావడంతో మెనూను పరిశీలించిన కలెక్టర్ ప్లేట్ తీసుకుని విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆహారంలో విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు వంటి పోషకాలు ఉండాలని సూచించారు. రోజూ సరైన పరిమాణంలో ఆహారం తీసుకోవాలని వివరించారు. అనంతరం వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారని అడిగి తెలుసుకుని, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను ప్రశ్నించారు. అలాగే విద్యాలయంలో నిర్మాణంలో ఉన్న గదులు, టాయిలెట్లు తదితర పనులపై ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. పదో తరగతి సహా ఇతర తరగతుల విద్యార్థులు ప్రతి సబ్జెక్టును బాగా చదవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

# నేరెళ్ల బాధితులకు తీన్మార్ మల్లన్న పరామర్శ

- 2017 పోలీస్ హింస ఘటనపై న్యాయం చేయాలంటూ డిమాండ్
- హామీలు ఇచ్చి మర్చిపోయారని బాధితుల ఆవేదన

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి:**



2017లో నేరెళ్ల గ్రామంలో జరిగిన పోలీస్ హింస ఘటనకు గురైన బాధితులను తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారి నివాసాల్లో కలుసుకుని పరామర్శించారు. ఘటనకు ఎనిమిదేళ్లు పూర్తయినా ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక లారీ దహనం కేసు నేపథ్యంలో అప్పట్లో పలువురు గ్రామస్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని ఐదు రోజుల పాటు స్టేషన్‌లో ఉంచి థర్డ్ డిగ్రీ పద్ధతిలో చిత్రహింసలకు గురిచేశారని బాధితులు తెలిపారు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పలువురు రాజకీయ నాయకులు వచ్చి హామీలు ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎవరూ పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి ఎస్పీ విశ్వజిత్ కంపాటి, ఎస్ఐ రవీందర్ పాత్రపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మల్లన్నను కోరారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ.. నేరెళ్ల ఘటన బాధితులకు తక్షణ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కేసులో బాధ్యులైన పోలీస్ అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. నేరెళ్ల ఘటనపై న్యాయం జరిగే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ బాధితుల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని మల్లన్న స్పష్టం చేశారు.

## వైభవంగా వెంకటేశ్వర రథోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ కొలగాని శ్రీనివాస్

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి మండలంలోని వెదురుగట్ట గ్రామంలో వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణతో పరిసరాలు మారుమోగగా, స్వామివారిని ప్రత్యేక రథంపై భక్తులు దర్శించుకున్నారు. ఈ వేడుకను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ వేర్వేరుగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంచాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మారం సమత శ్రీనివాస్, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, చిలుక సంజీవ్, పంతంగి ప్రభాకర్, అడ్డగుంట శంకర్, చిలుక చంద్రయ్య, జక్కుల శంకర్, పెంచాల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు

**వేద న్యూస్, చందుర్తి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం అసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠ శాలలో జాతీయ భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలు, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎన్. రజిత మాట్లాడుతూ ట్రాఫిక్ సంకేతాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ ధరించాల్సిన అవసరం ఉందన్నారు. వేగ పరిమితులు పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని సూచించారు. జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని, ట్రాఫిక్ నియమాలు తెలుసుకుని బాధ్యతగా ప్రయాణిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్, అర్చిత, తిరుమలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రెడ్డి సంఘం అధ్యక్షుడిపై కేసు నమోదు

**వేద న్యూస్, చందుర్తి:**

చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన మారు శశిపాల్ రెడ్డి కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసి మానసికంగా వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణల నేపథ్యంలో రెడ్డి సంఘ అధ్యక్షుడు పోతుగంటి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్ఐ జె. రమేష్ తెలిపారు. శశిపాల్ రెడ్డి 2020లో రామారావుపల్లి గ్రామానికి చెందిన అలేఖ్యతో వివాహం చేసుకున్నారని, ఇద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా పలుమార్లు పంచాయతీలు జరిగాయని చెప్పారు. ఆ పంచాయతీల్లో సంఘ అధ్యక్షుడు పోతుగంటి శ్రీనివాస్ రెండు లక్షల రూపాయలు దడవతిగా తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. పంచాయతీ ద్వారా సమస్య పరిష్కారం కాకపోవడంతో కోర్టును ఆశ్రయించగా, దడవతిగా తీసుకున్న డబ్బులు ఇవ్వాలని అడిగితే ఇవ్వనని చెప్పి శశిపాల్ రెడ్డిని సంఘం నుంచి బహిష్కరించినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అలాగే సంఘ సభ్యుడి కుమారుడి వరపూజ కార్యక్రమానికి పిలిచినందుకు రూ.5వేలు జరిమానా విధించినట్లు ఫిర్యాదులో ఉందన్నారు. ఈ మేరకు ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ జె. రమేష్ వెల్లడించారు.

వేద న్యూస్

గురువారం మార్చి 05, 2026

# ప్రభ బండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి

**వేద న్యూస్, నర్సంపేట :**

గీసుకొండ మండలం కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి జాతరను పురస్కరించుకొని నర్సంపేట నియోజకవర్గం నుండి వందలాదిగా కదిలిన కాంగ్రెస్ పార్టీ ప్రభ బండ్లను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ పూర్వం నుండి హోలీ పర్వదినం నుండి ప్రారంభమయ్యే కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి జాతరకు నర్సంపేట నియోజకవర్గం తో పాటు వరంగల్ జిల్లాలో ప్రభ బండ్లను కట్టే ఆనవాయితీ కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ తరపున నర్సంపేట నియోజకవర్గంలోని వందలాది గ్రామాల నుంచి ప్రభలు కట్టి లక్ష్మీ నరసింహ స్వామి జాతరలో ఉత్సాహంతో మెల తిరిగి లక్ష్మీ నరసింహ స్వామి కరుణాకటాక్షాలకు పాత్రులై ఈ ప్రాంతమంతా కూడా సుభిక్షంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. అంతేకాకుండా కొమ్మల లక్ష్మీ నరసింహ స్వామి ఎంతో మహిమ గల దైవమని ఆ లక్ష్మీనరసింహస్వామి దీవెనలతో నర్సంపేట నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని,పెద్ద ఎత్తున ప్రబల వెంట గ్రామాలలోని ప్రజలు,మహిళలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు భాజా భజంత్రీలతో కాంగ్రెస్ పాటలతో నాట్యాలాడుతూ పాల్గొన్నారు.



# కెనాల్ పనుల్లో జాప్యంపై మల్లన్న ఆగ్రహం

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో ఎల్ఎం-6 కాలువ పనులు పూర్తిచేయాలని రైతులు చేపట్టిన దీక్ష 23వ రోజుకు చేరుకుంది. గత ప్రభుత్వం కాలువ పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ పూర్తి కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రామోజీపేటలోని శ్రీ సీతారాముల ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రైతుల దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వారి ఆవేదన విన్నారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ.. రెండు మండలాల్లోని పలు గ్రామాల రైతులకు ఉపయోగపడే ఈ కాలువ పనులు సుమారు ఒక కిలోమీటర్ మేర నిలిచిపోవడం బాధాకరమన్నారు. మిగిలిన పనులకు సుమారు రూ.3 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని, అయినప్పటికీ పనులు పూర్తి చేయడంలో ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యను సంబంధిత ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైతే అసెంబ్లీలో కూడా లేవనెత్తి కాలువ



పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు, గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం కాచపూర్ గ్రామంలో బుధవారం సైబర్ జాగ్రత్త దివస్ కార్యక్రమం సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎస్ఐ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ధరలకు హోటల్ బుకింగ్‌లు, హాలిడే లేదా టూర్ ప్యాకేజీల పేరుతో వచ్చే నకిలీ లింకులు, వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే సెల్ టవర్ ఏర్పాటు, ప్రభుత్వ ప్రాజెక్టులు, బ్యాంక్ కస్టమర్ కేర్ పేరుతో ఫోన్ చేసి ఓటీపీలు, పిన్ నంబర్లు తీసుకుని సైబర్ నేరగాళ్లు డబ్బులు మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, పిన్ నంబర్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వకూడదని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా వేధింపులు లేదా అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా సమీప పోలీస్




స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలపై తేనెటీగల దాడి

- కాలువ పనుల సమయంలో జరిగిన ఘటన
- పలువురు కూలీలు గాయాలు- ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స

**వేద న్యూస్ రాజన్న సిరిసిల్ల:**

ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలపై తేనెటీగలు దాడి చేయడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకలం రేగింది. ఈ ఘటన జిల్లాలోని నిజామాబాద్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం, ఉపాధి హామీ పనుల భాగంగా కూలీలు కాలువ తవ్వే పనులు చేస్తున్నారు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు సమీపంలోని పార చెట్టుపై ఉన్న తేనెతెట్టకు పనిముట్లు తగలడంతో ఒక్కసారిగా తేనెటీగలు కూలీలపై దాడి చేశాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న పలువురు కూలీలు గాయపడ్డారు. తేనెటీగల దాడితో భయాందోళనకు గురైన కూలీలు అక్కడి నుంచి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే గాయపడిన వారిని సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై అధికారులు వివరాలు సేకరిస్తూ అవసరమైన చర్యలు చేపట్టారు.



# చిత్తూరులో కాల్పుల కలకలం



**వేద న్యూస్ అమరావతి:**

చిత్తూరు జిల్లాలో కాల్పుల ఘటన కలకలం రేపింది. పేకాట ఆడుతున్న సమయంలో ఇద్దరు స్నేహితుల మధ్య డబ్బు బాకీ విషయంలో తలెత్తిన ఘర్షణ చివరకు హత్యకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మిందపాల్యం గ్రామానికి చెందిన యువకులు కలిసి పేకాట ఆడుతుండగా రూ.2 లక్షల బాకీ విషయంపై వాగ్వాదం జరిగింది. బాకీ ఎప్పుడు చెల్లిస్తావని అడగడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఢిల్లీ బాబు (26) అనే యువకుడు కోపంతో నాటు తుపాకీతో సాయికుమార్ (24) అనే యువకుడిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

# గ్రీన్ ఇండియా చాలెంజ్ లో పాల్గొన్న చైర్మన్



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ గా మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ఎన్నికైన తర్వాత మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్.. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గఠ్రెపల్లి సతీష్ అధ్వర్యంలో జమ్మికుంట మున్సిపల్ కార్యాలయ సమీప పార్క్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమం ఉద్దేశించి చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో పాల్గొని అనేక మొక్కలు నాటినట్టు తెలిపారు. ప్రస్తుత కాలుష్య ప్రపంచంలో ఈ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అనేది గొప్ప విషయం అని, రానున్న ఈ 5 సంవత్సరాల కాలంలో విడతల వారిగా మొక్కలు నాటి ఈ కార్యక్రమం మరింత విజయవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చెప్యాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పుల హెచ్చరిక

- పర్యావరణ అవగాహన కార్యక్రమాల ప్రాధాన్యం
- ప్రకృతి సంక్షోభాలపై ప్రపంచ ఆందోళన
- పర్యావరణ పరిరక్షణకు అంతర్జాతీయ పిలుపు
- భూమి భవిష్యత్తు మన చేతుల్లోనే



**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమాలు కేవలం ఒక రోజు కార్యక్రమాలుగా కాకుండా, భూమి భవిష్యత్తును కాపాడుకోవాలన్న బాధ్యతను ప్రపంచానికి గుర్తుచేసే ప్రయత్నంగా మారుతున్నాయి. ప్రకృతి వనరుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యవసర అంశంగా మారింది. ఇటీవలి సంవత్సరాల్లో వాతావరణ మార్పుల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోంది. అసాధారణ ఉష్ణోగ్రతలు, వరదలు, కరువులు, తుఫానులు, అడవుల అగ్నిప్రమాదాలు వంటి ప్రకృతి విపత్తులు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. ఇవి కేవలం ప్రకృతి సంఘటనలు మాత్రమే కాకుండా, మానవ కార్యకలాపాల వల్ల ఏర్పడిన పర్యావరణ అసమతుల్యతకు సంకేతాలుగా భావిస్తున్నారు. పరిశ్రమల విస్తరణ, అడవుల నరికివేత, కాలుష్యం పెరగడం వంటి కారణాలతో భూమి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీనివల్ల సముద్ర మట్టం పెరగడం, మంచు పర్వతాలు కరుగడం, జీవ వైవిధ్యం తగ్గిపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితులు కొనసాగితే భవిష్యత్తులో మానవ జీవనంపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ నేపథ్యంలో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. చెట్ల పెంపకం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, పునర్వినియోగ వనరులను ఉపయోగించడం, నీటి సంరక్షణ వంటి అంశాలపై ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడి బాధ్యత అని ఈ కార్యక్రమాలు గుర్తుచేస్తున్నాయి. పర్యావరణ సమస్యలు ఒక దేశానికి మాత్రమే పరిమితం కావు. అవి ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే సమస్యలు. అందుకే ప్రపంచ దేశాలు కలసి పని చేయాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ సమావేశాలు, ఒప్పందాలు, వాతావరణ సదస్సులు ఇవి పర్యావరణ పరిరక్షణకు దిశానిర్దేశం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. నేటి తరానికి మాత్రమే కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రకృతితో సమతుల్యతను కాపాడుకోవడం ద్వారా మాత్రమే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

ఈ అవగాహన కార్యక్రమాలు ప్రపంచానికి ఇచ్చే ప్రధాన సందేశం ఇదే. మొత్తంగా చూస్తే, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు భూమి భవిష్యత్తును కాపాడే ప్రయత్నాల్లో ఒక ముఖ్యమైన భాగంగా నిలుస్తున్నాయి. ప్రకృతిని సంరక్షించడం అంటే మానవ జీవనాన్ని సంరక్షించడమే అన్న భావనను ప్రపంచానికి గుర్తు చేస్తూ ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, పునర్వినియోగ శక్తి వనరుల వినియోగం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలపై ప్రజల్లో చైతన్యం పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణలో ప్రతి వ్యక్తి పాత్ర ముఖ్యమని ఈ కార్యక్రమాలు గుర్తుచేస్తున్నాయి. చిన్న చర్యలే పెద్ద మార్పుకు దారితీయగలవని నిపుణులు సూచిస్తున్నారు.ప్రపంచ దేశాలు కూడా పర్యావరణ పరిరక్షణ కోసం వివిధ అంతర్జాతీయ ఒప్పందాలు, సమావేశాల ద్వారా చర్యలు చేపడుతున్నాయి.

వాతావరణ మార్పులను నియంత్రించడానికి గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడం, పునర్వినియోగ శక్తి వనరులను ప్రోత్సహించడం వంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు. అయితే ఈ చర్యలు వేగంగా అమలుకాకపోతే సమస్య మరింత తీవ్రతరం కావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. సమాజం మొత్తం ఇందులో భాగస్వామ్యం కావాలి. ప్రకృతితో సమతుల్యతను కాపాడుకోవడం ద్వారా మాత్రమే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రకృతిని దోపిడీ చేసే అభివృద్ధి నమూనాలు భవిష్యత్తుకు ప్రమాదకరమని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించాలంటే ఇప్పుడే చర్యలు తీసుకోవాలి.తెలియజేస్తున్నాయి. భూమి భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందన్న సత్యాన్ని గుర్తుచేస్తూ ప్రపంచాన్ని బాధ్యతాయుత చర్యల వైపు నడిపిస్తున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073